క్లుప్తంగా

జెడ్పీటీసీ ఉదారత



కలెక్టర్ నాగలక్ష్మి చేతులు మీదుగా విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీపురుపల్లి: గరివిడి మండల జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు తన ఉదారతను చాటుకున్నారు. నెలిమర్లలో నిర్మిస్తున్న రామకృష్ణ ప్రార్థన మందిరం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతులు మీదుగా ఈ మొత్తాన్ని రామకృష్ణ మందిర నిర్వాహకులు జగన్నాథరాజుకు అందజేశారు. జెడ్పీటీసీగా తనకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవ వేతనం రూ.72 వేలుకు మరో రూ.28 వేలు జోడించి మొత్తం లక్ష రూపాయలను రామకృష్ణ ప్రార్థన మందిరానికి విరాళంగా అందజేశారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యసంఘం సభ్యులు

జామి: మండల కేంద్రమైన జామిలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు యిందుపూరి సుబ్బరాజు చేతులు మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో ప్రతీ శుక్రవారం పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి విజ్జపు సంతోష్, కోశాధికారి ఐ.వై సతీష్, కె.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రూరల్ ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున భవానీనగర్, కొత్తరోడ్డు, భర్తాపురం, మరుపల్లి, జెడ్.కుమరాం, ధారపర్తి, కాపుసోంపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

దత్తిరాజేరు: మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పెదమానాపురం ఎస్సై శిరీష అన్నారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రత నియమాలు, ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఆర్‌సీని వెంట ఉంచుకోవాలని, లేదంటే జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు.

అంగన్‌వాడీల నిరసన

శృంగవరపుకోట: తమ డిమాండ్ల సాధన కోసం గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద చీర చెంగులతో ఉరిపోసుకున్నట్లు తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని, లేదంటే తమకు మరణమే శరణ్యమని వాపోయారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు నారాయణరావు

నెల్లిమర్ల: కేబుల్ ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ కేబుల్ ఆపరేటర్ల సంఘ ప్రతినిధులు ఎ.నారాయణరావు, బి. స్వామినాయుడు కోరారు. పట్టణంలోని పూడమ్మతల్లి వనం గుడి ప్రాంగణంలో నెల్లిమర్ల, గుర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం, గంట్యాడ, గజపతినగరం మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు సమాచారం అందించడంలో ఆపరేటర్లు చురుకైన పాత్ర పోషించారన్నారు. కోవిడ్ తర్వాత ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆపరేటర్లను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు రాము, సురేష్, జగన్నాథం, లక్ష్మణరావు, రామదాసు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలు మరిచిపోలేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ప్రభుత్వంపై బురదజల్లే టీడీపీ నాయకులకు ప్రజలే చెంప చెల్లుమనిపిస్తారు.
- నియోజకవర్గంలో నిష్పాక్షిక పాలన అందిస్తున్నాం..
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: టీడీపీ ప్రభుత్వం గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను నిలువెత్తున మోసం చేసిందని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ద్రోహాన్ని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం ప్రభుత్వంపై బురదజల్లడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందని ఎద్దేవాచేశారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు రైతుల నుంచి ధాన్యం దోచేస్తున్నారని తమపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే అప్పలనరసయ్య తీవ్రంగా ఖండించారు. టీడీపీ హయాంలో వారు చేసిన అవినీతిని తమపై రుద్దడం సరికాదని హెచ్చరించారు. రైతాంగాన్ని మోసం చేసి దోచుకోవడం, దాచుకోవడం, తినుకోవడం అనేది టీడీపీ నైజమని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు చేసిన మోసాలను ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు నేటికీ మరిచిపోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించి అమలు చేస్తోందన్నారు. అందులో పేర్కొన్న అన్ని హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ కార్యకర్తలే సంతోషంగా చెప్తున్నారన్నారు. కుల, మత, విబేధాలు లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా పరిపాలన సాగిస్తున్నామని, రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి అన్ని విధాలా అండగా ఉంటున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. జిల్లాలో ప్రస్తుతం 25 శాతం ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించడం జరిగిందని, రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ చేయడం జరిగిందన్నారు. సంక్రాంతి పండగకు ముందు జిల్లా వ్యాప్తంగా 71 శాతం ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యాన్ని అధికారులను నిర్దేశించినట్లు చెప్పారు. రంగుమారిన ప్రతీ ధాన్యం గింజను రైతులు నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అసరం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, సీనియర్ నాయకులు బి.త్రినాథరావు, మండల సురేష్, కె.పైడిపునాయుడు, రామునాయుడు, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదు



రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణంపై ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న జయమణి

- ఎస్సీ కమిషన్ స్టేట్ మెంబర్ జయమణి

బొండపల్లి: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ నవరపు జయమణి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం స్థానికులు 20 ఏళ్లుగా పడుతున్న అవస్థలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవతో ప్రభుత్వం రూ.90 లక్షలు నిధులు కేటాయించింది. ఆ నిధులతో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపడుతుండగా.. కొంత మంది పనులను అడ్డుకున్నారు. పనులు నిలుపుదల చేయాలని ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె శుక్రవారం ఎస్సీ కాలనీలో పర్యటించారు. ట్యాంకు నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ కాలనీవాసులతో పాటు స్థానిక సర్పంచ్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించడం జరిగిందన్నారు. ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేకపోయినా కొంత మంది స్వార్థ ప్రయోజనాల కోసం అందరికీ ఉపయోగపడే రక్షిత ట్యాంకు నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదని ఆమె అన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం

సమస్యను ఎస్టీ కమిషన్ స్టేట్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు ఫోన్‌లో వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంటనే స్పందించి పనులు యథావిధిగా చేపట్టాలని, ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు జారీచేస్తానని ఫోన్‌లో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబరు నవరపు రామరావు, వైస్ ఎంపీపీ గొండెల ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, వార్డు సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఈకేవైసీతో నకిలీ కనెక్షన్లకు చెక్



ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులుతీరిన లబ్ధిదారులు

గజపతినగరం: వంట గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ కోసం బారులుతీరుతున్నారు. డబుల్ ఎంట్రీ, నకిలీ కనెక్షన్లు, చనిపోయిన వారి పేరుపై ఉన్న గ్యాస్ కనెక్షన్లను తొలగించేందుకు ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించింది. దీంతో గజపతినగరం టౌన్ పరిధిలో ఉన్న రెండు గ్యాస్ ఏజెన్సీల వద్ద శుక్రవారం పెద్ద సంఖ్యలో వినియోగదారులు బారులుతీరారు. ఈకేవైసీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు. గ్యాస్ వినియోగంలో పాదర్శకతను తీసుకువచ్చేందుకు, ట్రాన్స్‌ఫర్ అయిన వారు, మృతిచెందిన వారు, డబల్ ఎంట్రీ అయిన కనెక్షన్లకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు.

రూ.75 లక్షలతో బ్లడ్ బ్యాంక్ నిర్మాణం



నిర్మాణం పూర్తి చేసుకున్న బ్లడ్ బ్యాంక్ భవనం

చీపురుపల్లి: అత్యవసర సమయాల్లో ఆస్పత్రుల్లో ఉన్న వారికి రక్తం కోసం ఇంతవరకు విజయనగరం, విశాఖపట్టణం పరుగులు తీయాల్సి వచ్చేది. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో బ్లడ్‌బ్యాంక్ ఉన్నప్పటికీ పరిమిత స్థాయిలో మాత్రమే రక్త నిల్వలు ఉండేది. దీంతో రక్తం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. ఆ సమస్యను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి సీహెచ్‌సీ ఆవరణలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(ఐఆర్‌సీఎస్) వారితో చర్చించి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన భవనం, రిఫ్రిజిరేటర్లు, ఇతర పరికాల కోసం రూ.75 లక్షలు నిధులు అవసరమని గుర్తించారు. అయితే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఆ సంస్థ పర్యవేక్షణలోనే బ్లడ్ బ్యాంక్ నిర్మాణం, అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే ఈ బ్లడ్ బ్యాంకును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ మంజూరుకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం రమేష్‌కుమార్, తదితరులు

గజపతినగరం: పురిటిపెంట బాలికోన్నత పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్‌ను మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు పాఠశాల హెచ్‌ఎం చిప్పాడ రమేష్‌కుమార్, సిబ్బంది శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. 397 మంది విద్యార్థినులు చదువుతున్న ఈ పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఆర్‌ఓ ప్లాంట్ మంజూరుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పీఈటీ శ్రీను, జెడ్పీటీసీ గార తవుడు, పురిటిపెంట వైస్ సర్పంచ్ మండల సురేష్, పైడిరాజు, తదితరులు ఉన్నారు.

నెల రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

- మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: మండలంలో వివిధ స్థాయిలలో ఉన్న గృహ నిర్మాణాలను జనవరి 31లోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై శుక్రవారం హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులకు నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యాలని వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడి వారిని నిర్మాణాలు పూర్తిచేసేలా చైతన్యపరచాలని సూచించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష-2 విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.ఎస్.కూర్మనాథ్ పట్నాయక్, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఈఓపీఆర్డీ ఉమా, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.



గజపతినగరంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

మంచు దుప్పటి

గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లో శుక్రవారం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 8 గంటలైనా మంచు ప్రభావం తగ్గకపోవడంతో వాహనదారులు, పాదచారులు దారి సరిగా కనబడక ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. దట్టంగా కురుస్తున్న పొగమంచు వల్ల మామిడి పూతకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – గజపతినగరం



లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



మంచు దుప్పటిలో పురిటిపెంట న్యూకాలనీ



మంచులోనే షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



లక్కవరపుకోట: గంగుబూడి హైస్కూల్ వద్ద జరుగుతున్న వాలీబాల్ పోటీలను తిలకిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

గ్రామీణ ప్రాంత యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. యువత ఈ పోటీల్లో హుషారుగా పాల్గొని క్రీడల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లో పలు సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. – సాక్షి నెట్‌వర్క్



జామి: అలమండలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



శృంగవరపుకోట: కిల్తంపాలెం నవోదయ విద్యాలయం మైదానంలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు



దత్తిరాజేరు: పెదమానాపురం ఉన్నత పాఠశాల మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు



శృంగవరపుకోట: ధర్మవరం మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్‌లో పోటీపడుతున్న యువత

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్:

విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి వార్షిక క్యాలెండర్, డైరీలను రూపొందించుకున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వాటిని పక్కాగా అమలు చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్-2020, డైరీలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, విద్యారంగంలో జిల్లాను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు, టి.సన్యాసిరాజు, రాష్ట్ర బాధ్యులు రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ఏవీ రమణ, కోశాధికారి సాయి చక్రధర్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

రూ. 56.19 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం



7వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లు

విజయనగరం: నగరంలోని అన్ని ప్రాంతాల్లోను అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 7, 8, 19 డివిజన్‌లలో రూ.56.19 లక్షలతో నూతనంగా రోడ్లు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. 7వ డివిజన్ దాసన్నపేటలో కాళీమాత ఆలయం వద్ద రహదారి నిర్మాణానికి, దక్షిణ గట్టు ప్రాంతంలో కాలువలకు, లంకాపట్నంలోని రహదారుల పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల కోరిక మేరకు అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పార్కులు, ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయడంతో పాటు పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశామన్నారు. 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ, ఎన్నడూ లేనివిధంగా తమ డివిజన్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. వాటర్ ట్యాంకుల నిర్మాణం ద్వారా తాగునీటి సమస్య తీరిందని చెప్పారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ ఎస్.బంగారునాయుడు, స్థానిక నాయకులు పొట్నూరు శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విషయాలు నేర్చుకోవాలి

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ మహంతి



సర్టిఫికెట్లు అందుకున్న తెలంగాణ విద్యార్థులతో సెంచూరియన్ వీసీ మహంతి, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విభాగంలో శిక్షణ పొందిన తెలంగాణ విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, వృత్తి సంబంధమైన కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అవగాహన పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, రమణారావు, సన్నీడియోల్, మురళి, తదితరులు పాల్గొన్నారు.